క్లుప్తంగా

నేడు సింగరేణిలో రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న అండర్‌మేనేజర్ ఈ గ్రేడ్–2 (అంతర్గత) 33 పోస్టులకు ఈనెల 13న సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 33 పోస్టులకు 234 మందికి యాజమాన్యం హాల్‌టికెట్లు పంపించింది. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ ఆధారంగా ఉంటుందని, అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం బి.నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం



విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ

పాల్వంచ: చిన్నప్పటి నుంచే విద్యార్థులు కరాటేపై మక్కువ పెంచుకోవాలని, తద్వారా ఆత్మస్థైర్యం అలవడుతుందని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మేరీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. రాణించిన విద్యార్థులను అభినందించారు. మాట్లాడుతూ... కరాటేలో శిక్షణ పొందే విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు జె.మరియమ్మ, జె.రాము, ఉషారాణి, వీరమల్లు, అంబ్రికా జాదవ్, రమ్య పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పెంపు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ హైదరాబాద్ వారిచే నిర్వహించబడుతున్న 2025–26 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల గడువు పొడిగించడం జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 వరకు అడ్మిషన్ పొందవచ్చని, ఆగష్టు 1 నుంచి 31వ తేదీ పదో తరగతి వారు రూ.100, ఇంటర్ వారు రూ.200 ఫైన్‌తో అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 8008403522 నంబరులో సంప్రదించాలని కోరారు.

'అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలి'



మాట్లాడుతున్న హరిప్రియ

టేకులపల్లి: అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల పర్యటనల్లో భాగంగా శనివారం టేకులపల్లి మండలం చింతంచలక గ్రామ పంచాయతీలోని గ్రామాలలో పర్యటించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో కలిసి గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను మోసం చేసిన, హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఓడించాలని పిలుపునిచ్చారు. వరప్రసాద్‌గౌడ్, బాలు, కిషన్, భూక్యా లాలునాయక్, రేణుక పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

జూలూరుపాడు: ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఏజెన్సీ చట్టాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సరైంది కాదని, తక్షణమే నిలిపివేయాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయండి..

ఇల్లెందు: ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ నేతలు కోరారు. శనివారం ఇల్లెందులో కొత్త బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని హరీష్‌గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రతీ శాఖలో అనేక ఖాళీలు ఉన్నాయని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ యాదవ్, ఇమ్రాన్, ఖాసీం, అన్వేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

బొటిక్, టైలరింగ్‌తో ఉపాధి

- అలంకరణే ఆలంబనగా..
- సరికొత్త ఫ్యాషన్‌పై మోజు
- నానాటికీ వృద్ధి చెందుతున్న వ్యాపారం
- శిక్షణ ఇస్తున్న 'అలంకృత ఉమెన్ ఎంపవర్‌మెంట్' సర్వీస్ సొసైటీ



కటింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళలు

సండే స్పెషల్

పాల్వంచ: రోజురోజుకు ఫ్యాషన్ డిజైనింగ్ సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఎప్పటికప్పుడు డిజైన్‌లు మారుతూ మరింత అందాలను కనబర్చేలా అలంకరణలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు ఖర్చుకు సైతం వెనుకాడటం లేదు. ఈ క్రమంలో ఫ్యాషన్ రంగాన్ని అందిపుచ్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మహిళలు బొటిక్, టైలరింగ్‌పై మక్కువ చూపిస్తున్నారు. శిక్షణ పొంది ఉపాధి అవకాశంగా మల్చుకుంటున్నారు. పాల్వంచలోని అలంకృత ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ద్వారా మహిళలకు బొటిక్, మగ్గం వర్క్స్, శారీస్ రోలింగ్, లేజర్ కటింగ్, స్టిచ్చింగ్, ఎంబ్రాయిడరీ వర్క్‌పై ఇతర రాష్ట్రాలకు చెందిన శిక్షకులతో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా గుజరాత్‌కు చెందిన శిక్షకులు ఇక్కడ పనిచేస్తున్నారు. ఈ శిక్షణను ఆన్‌లైన్ ద్వారా కూడా నేర్పిస్తుండటంతో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారితో పాటు, ఇతర దేశాలకు చెందిన పలువురు సైతం శిక్షణ తీసుకుంటున్నారు. కొత్తగూడెం, వైజాగ్, రాజమండ్రి, హైదరాబాద్, పాల్వంచ తదితర ప్రాంతాలకు చెందిన వారు శిక్షణ తీసుకుంటుండగా, వారి శిక్షణ కాలంలో హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. ఈ సొసైటీ ద్వారా ఇప్పటి వరకు 650 మంది మహిళలు టైలరింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.

సొసైటీ నిర్వాహకురాలు పల్లా ధనలక్ష్మి బృందా ఫ్యాషన్స్, భాగ్య బొటిక్, అలంకృత బొటిక్, టైలరింగ్ ఇనిస్టిట్యూట్, శ్రీ లక్ష్మీ శ్రీనివాస్ ట్రైనింగ్ సెంటర్, యూ ట్యూబ్ చానల్ నడిపిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. యూ ట్యూబ్‌లో లక్షల మంది ఈ శిక్షణను వీక్షిస్తున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న అనేక మంది బొటిక్ సెంటర్లను నెలకొల్పి ఉపాధి పొందడమే గాక అనేక మందికి సైతం ఉపాధి కల్పిస్తున్నారు. మిషనరీ, కంప్యూటర్ గ్రాఫిక్‌లు అందుబాటులో వచ్చాయి. గతంలో రోజుల తరబడి అయ్యే పని ఇప్పుడు నిమిషాల్లో చేస్తున్నారు.

ఫ్యాషన్ రంగంలో కొత్త పుంతలు...

ఫ్యాషన్ రంగం సరికొత్త పుంతలు తొక్కుతోంది. మహిళలు, పిల్లలు, పురుషులు సైతం మారుతున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా దుస్తులపై మక్కువ చూపిస్తున్నారు. వెస్టన్, క్లాసికల్, కుర్తాలు, పంజాబీ, డ్రస్సులపై పలు రకాల డిజైన్లు వాడుకలో కొత్త రకాలు వస్తున్నాయి. ఈక్రమంలో వ్యాపారం సైతం నానాటికీ వృద్ధి చెందుతోంది.



బొటిక్ కేంద్రంలో మగ్గం వర్క్ చేస్తున్న కోల్‌కతా వాసీ

ప్రత్యేక మాస్టర్ ఉంటేనే ఆర్డర్లు..

టైలరింగ్, బొటిక్‌కు వచ్చే కస్టమర్లు ఎంబ్రాయిడరీ వర్క్‌లు ఆర్డర్లు ఇచ్చే ముందు ప్రత్యేక మాస్టర్లు ఉన్నారా అని అడిగి ఆర్డర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఉపాధి కోసం ఇక్కడికి వలస వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడువేల మంది ఇక్కడ కుటుంబాలతో వచ్చి ఉపాధి పొందుతున్నారు. వారిపైనే ఆధారపడి బొటిక్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వారికి వసతి కల్పించి పనిచేయించుకుంటున్నారు.

ఉపాధి పొందుతున్నాం..



అలంకృత ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీలో బొటిక్, ఎంబ్రాయిడరీ, కుట్టుపనిపై శిక్షణ తీసుకున్నాను. ఇక్కడే పార్ట్‌టైంగా పనిచేస్తున్నా. ఇక్కడ నేర్చుకున్నవారు వైజాగ్, రాజమండ్రి, కొత్తగూడెం, పాల్వంచ తదితర ప్రాంతాల్లో బొటిక్ సెంటర్లు నెలకొల్పి ఉపాధి పొందుతున్నారు.

– పావని, స్టూడెంట్

కోల్‌కతా నుంచి వచ్చాం..



కోలకతా నుంచి చాలామంది కుటుంబాలతో వచ్చి ఇక్కడ ఉంటున్నాం. బొటిక్ పనికి గిరాకీ బాగుంది. ఆన్‌లైన్‌లో సైతం కొత్త డిజైన్లపై దృష్టి పెట్టి వాటిని కష్టమర్లకు డిజైన్ చేసి ఇస్తున్నాం. మాకు ఇక్కడ ఉపాధి బాగుంది. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ వాళ్లు ఇక్కడికి చాలామంది వస్తున్నారు.

– హసన్, కోల్‌కతా

ఈ రంగం బాగుంది...



మహిళలు చీరలు, బ్లౌస్‌లపై డిజైన్లను ఆకర్షిస్తున్నారు. ఈ రంగం మహిళలకు ఎంతో అనుకూలంగా, ఉపాధిగా ఉంది. మేం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. దూరప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి నేర్చుకుంటున్నారు. దేశ, విదేశాల్లో సైతం మా ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతున్నారు.

– పల్లా ధనలక్ష్మి, అలంకృత నిర్వాహకులు

పల్లెలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం..



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: ప్రజలు ఆదరిస్తే మారుమూల పల్లెలకు సైతం ఆర్టీసీ బస్సు సర్వీసు నడపనున్నట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లెందు నుంచి మాణిక్యారం మీదుగా సర్వేతండా వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును శనివారం ఆయన ప్రారంభించారు. ప్రయాణికులతో కలిసి సర్వేతండా వరకు ప్రయాణించారు.

ప్రతి గ్రామంలోనూ మహిళలు బస్సు సౌకర్యాన్ని స్వాగతించడంతోపాటు సర్వేతండా వరకు బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా కిన్నెర నర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలు ఆదరించినంత కాలం బస్సు సర్వీసు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బానోత్ రాంబాబు, జనగం కోటేశ్వరరావు, మెట్ల కృష్ణ, కొత్తగూడెం ఆర్టీసీ డీఎం దేవేందర్, ఇల్లెందు డిపో ఇన్‌చార్జ్ సునిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి..



జీఎం రామనాథానికి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్లు

సింగరేణి(కొత్తగూడెం): ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఐటీయూసీ నాయకులు కోరారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్లకు కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని జీఎం (ట్రాన్స్‌పోర్ట్) ఎం.రామనాథానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణిలో ప్రస్తుతం నడుస్తున్న ప్రైవేట్ కన్వేయన్స్ హైర్ వాహనాల టెండర్లు అయిపోయాయని, కొత్తగా వచ్చే హోండా సిటీ, ప్రైవేట్ కన్వేయన్స్ వాహనాల్లో అనుభవం కలిగి, మెడికల్, ఎంవీటీసీ, సీఎంపీఎఫ్ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 2023 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ వివరాలను వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రగాని కృష్ణయ్య, క్రిష్టాఫర్, ఎస్ఈ రామశేషయ్య, జే.మధుకుమార్, సతీష్, లక్ష్మీనారాయణ, లోకేష్, అరుణ్‌కుమార్, శ్రీను, రాజు, చక్రి, ఖాన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి



మాట్లాడుతున్న రమేష్

టేకులపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులను నివారించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం టేకులపల్లిలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అయినందున గ్రామీణ ప్రాంతాలలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విష జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే సీజనల్ వ్యాధులను అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో పాలకవర్గాలు లేకపోవడం వలన పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు చెప్పారు. ఏజెన్సీలో దోమతెరలను పంపిణీ చేయాలని కోరారు. మండల కేంద్రాలలో 24 గంటల వైద్య సదుపాయం కల్పించాలని, ప్రభుత్వ వైద్య రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోలా లక్ష్మీనారాయణ, పర్శిక రవి, మునలి సతీష్, వాంకుడోత్ మోతీలాల్, తోటకూరి సతీష్, ఆటికం శేఖర్, రావూరి ఉపేందర్, జోగకృష్ణ, తాటి రమేష్, కొడెం రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి నిలిచిన నీటి సరఫరా

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి సింగరేణి 47 లెవల్ నుంచి నెలరోజులుగా మున్సిపాలిటీకి వచ్చే నీటిని నిలిపివేశారు. సింగరేణి సంస్థకు సరఫరా అయ్యే మోటార్లు మరమ్మతులకు గురవడంతో వాటిని రిపేరుకు పంపించి, మున్సిపాలిటీకి నీటిని నిలిపివేసింది. దీంతో పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, సింగరేణి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా శనివారం మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌లో క్లీనింగ్ చేపట్టడం వల్ల నీటి సరఫరా నిలిపి వేసినట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

విద్యారంగానికి కేఎల్ఆర్ కృషి మరువలేనిది



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పాల్వంచ: ఏజెన్సీ జిల్లాలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యం కల్పించి, ఆయన చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. కేఎల్ఆర్ విద్యాసంస్థ అధినేత కె.లక్ష్మారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక కేఎల్ఆర్ ఘాట్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కె.సాబీర్ పాషా, ఎడవల్లి కృష్ణ, కొత్వాల శ్రీనివాసరావు, చావా లక్ష్మీనారాయణ, వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజుగౌడ్, కేఎల్ఆర్ కుటుంబ సభ్యులు కె.నాగమణి, గోవింద్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సిద్దార్థ్‌రెడ్డి, సింధు, స్నేహిత్, మురళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించండి..

ఇల్లెందురూరల్: పంటల సాగులో యూరియా వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ ఎరువులను వాడితే పెట్టుబడి భారం అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యాన శాఖ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. కొమరారం రైతు వేదికలో మునరా సంస్థ ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, మునరా గోల్డ్ తదితర ఎరువులు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచరూరల్: జగన్నాథపురం గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ధరావత్ రవి, రమేష్ శనివారం పాల్వంచకు వచ్చిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్రామంలో మట్టి రోడ్ల వలన వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం చేయాలని, మిషన్ భగీరథ తాగునీరు రావడంలేదని పేర్కొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు





కమ్యూనిటీ హాల్ డ్రెయినేజీలో కదలని మురుగు

సింగరేణి(కొత్తగూడెం): అధికారుల తప్పిదాలు కార్మికుల పాలిట శాపాలు.. దీనికి రామవరం కమ్యూనిటీ హాల్ నిదర్శనం. కార్మికుల సౌకర్యార్థం పలు కార్మిక సంఘాల నాయకుల అభ్యర్థన మేరకు ఈ కమ్యూనిటీ హాల్ 2015లో సుమారు రూ.23 లక్షలతో నిర్మాణం చేపట్టారు. అది నాలుగేళ్లు కాగానే, ఏరియా సివిల్ అధికారులు రినోవేషన్ కోసం సుమారు రూ.28 లక్షల పనులకు టెండర్ పిలిచి, పనులు కాంట్రాక్టరుకు అప్పగించారు. గతంలోనే కాంట్రాక్టరు పనులు సరిగా చేయని కారణంగా అనతి కాలంలోనే రినోవేషన్‌కు గురైందని ఏరియా సివిల్ అధికారులు ఏ రోజు, ఏ అధికారీ పనులను పర్యవేక్షించిన దాఖలాలు లేవని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.50 లక్షల కార్మికుల కష్టార్జితంతో పనులు చేసినప్పటికీ ఇంకా చాలా పను లు మిగిలిపోయాయి. అంటే సివిల్ అధికారుల ప్రతిపాదనలు ఏవిధంగా ఉన్నాయో ఇట్టే అర్థం అవుతోందని కార్మికులు గుసగులాడుకుంటున్నారు. ఇంకా ఈ కమ్యూనిటీ హాల్‌లో వాటర్ సమస్యతోపాటు, పార్కింగ్ సమస్య, చుట్టు సోలార్ ఫెన్సింగ్, ఐరన్ గ్రిల్స్, రెండో గేట్ ఏర్పాటు చేయాలని, జంతువులు, రాకుండా క్యాటిల్ గార్డ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు చేసిన పనులకే మళ్లీ రెనోవేషన్ పనులు చేయించారు కానీ, చేయాల్సిన పనులను ఆ రినోవేషన్ ప్రతిపాదనల్లో ఎందుకు పెట్టలేదో అర్థ కాని అంశంగా మారిందని కార్మికులు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా రూ.లక్షలు వ్యయం చేసి కమ్యూనిటీ హాల్‌లో నిర్మించినా కనీసం ఇక్కడ వాడుకున్న నీరు డ్రెయినేజీ ద్వారా బయటకు పోయే అవకాశం లేకుండా నిర్మించారు. అధికారులు, సరైన ప్రణాళికతో పనులు చేయడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు.

కమ్యూనిస్టులది రాజీలేని పోరాటం..



హాజరైన కార్యకర్తలు

పాల్వంచ: సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురు లేదని, ప్రజా హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేసే సత్తా కమ్యూనిస్టులకే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో సీపీఐ పట్టణ 19వ మహాసభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కూనంనేని మాట్లాడుతూ.. వందేళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న చరిత్ర సీపీఐకి ఉందన్నారు. సీపీఐ ఏ ప్రాంతానికో, వర్గానికో పరిమితమైన పార్టీ కాదన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజా ప్రస్థానంలో సీపీఐ నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలతో ప్రజలకు, కార్మికవర్గానికి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టినట్లు చెప్పారు. తనను అత్యధిక ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిపించారని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా చేసేందుకు నిరంతరం శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, గుండాల నాగరాజు, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, వాడే లక్ష్మి, విశ్వేశ్వరరావు, అజిత్, చెన్నయ్య, శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, సునీల్, నిమ్మల రాంబాబు, కోరె కృష్ణ, రెహమాన్, రామారావు, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఘనంగా సీత్లా పండుగ



సీత్లా మాతకు పూజ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇల్లెందురూరల్: సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం సీత్లా పండుగను వైభవంగా నిర్వహించారు. సప్తమాతృకలైన మేరామా, తొల్జా, మత్రాల్, కంకాళీ, హింగ్మా, ద్వాళాంగర్, సీత్లా భవానీలను పాఠశాల ఆవరణలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజ చేశారు. నైవేద్యం సమర్పించి, అనంతరం విద్యార్థులకు పంపిణీ చేశారు. బంజారా సంప్రదాయ వేషధారణలతో నృత్యాలు చేస్తూ అలరించారు. ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ.. తమ ఆచార వ్యవహారాలను విద్యార్థులు మననం చేసుకునేలా పాఠశాలలో పండుగ నిర్వహించినట్లు చెప్పారు.

మండుతున్న ధరలు

- స్థానికంగా కూరగాయల దిగుబడి ఉన్నా అధికంగా రేట్లు
- ఎవరికీ పట్టని నియంత్రణ
- పేదలకు దూరమవుతున్న పౌష్టికాహారం

ఇల్లెందురూరల్: ఆహారంలో కాయగూరలు తగినంత తీసుకుంటేనే ఆరోగ్యం స్థిరంగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. కానీ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు చుక్కలనంటాయి. మార్కెట్‌లో ధరలు చూసి ప్రజలకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. పేదలకు పౌష్టికాహారం దూరమవుతోంది. కూరగాయల సాగుపై అటు పాలకులు, ఇటు అధికారులు చూపుతున్న నిర్లక్ష్యమే దీనికి కారణమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆదరణ కొరవడి..

ఇల్లెందు మండలంలోని ఏజెన్సీ గ్రామాలు సుమారు రెండు దశాబ్దాలుగా జిల్లాలో కూరగాయల సాగుకు చిరునామాగా ఉన్నాయి. ఏప్రిల్ చివరి వారం నుంచే కూరగాయల సాగు ప్రారంభించే రైతులు సీజన్‌లో తొలిపంటగా కాకర పండిస్తారు. ఆ వెంటనే బీరకాయ, బెండ, వంకాయ, క్యాబేజీ తదితర పంటలను సాగు చేసేవారు. కానీ గడిచిన మూడేళ్లుగా కూరగాయల పంటలను ఆశిస్తున్న చీడపీడలు, చైతన్యపర్చేందుకు ఉద్యాన శాఖ అధికారులు కనీస ప్రయత్నం కూడా చేయకపోవడం ఒక కారణమైతే దిగుబడి బాగా వచ్చినా విక్రయ సౌకర్యం లేక సాగు చేసిన రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు.

దోచేస్తున్న దళారులు...

సాధారణంగా చేనులో కోసిన కూరగాయలు ఒక రోజు మించితే నాణ్యతను కోల్పోతాయి. ఇది ధరలపై ప్రభావం చూపుతోంది. పల్లెల్లో విస్తారంగా పండుతున్న కూరగాయలను రెండు, మూడు రోజులు భద్రపర్చుకునేందుకు ఏసీ గోదాములు లేకపోవడం, నేరుగా విక్రయించేలా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో స్థానికంగా వ్యాపారుల ముసుగులో ఉన్న దళారులకు కూరగాయలను విక్రయించక తప్పడం లేదు. ఇలా కొనుగోలు చేసిన దళారులు కొంత ధర పెంచి వ్యాపారులకు సరఫరా చేస్తుండగా వారు మరికొంత ధర పెంచి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఇలా రైతు దళారీకి విక్రయించిన ధర కంటే రెట్టింపు ధరతో వినియోగదారులు కొనుగోలు చేయక తప్పడం లేదు. ఫలితంగా అటు పండించిన రైతుకు నష్టం ఎదురవుతుండగా.. ఇటు వినియోగదారునికి ఆర్థికభారంగా మారుతోంది. ప్రస్తుతం ఇల్లెందు మండలంలో కాకర, బీర, సొర, బెండకాయి, వంకాయ, మిర్చి వంటి కూరగాయలతోపాటు ఆకు కూరలను సైతం రైతులు పండిస్తున్నారు. ఆయా పంటల ధరలు సైతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వాటి మాదిరిగానే ఇల్లెందు మార్కెట్‌లో ధరలు చుక్కలనంటేలా ఉండటం దళారుల దోపిడీకి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది.




ఇల్లెందులో కూరగాయల దుకాణం

ఎందుకీ పరిస్థితి...

కూరగాయల విక్రయ ధరలలో నియంత్రణ లేకపోవడం, తూనికలు కొలతల శాఖ అధికారులతోపాటు స్థానిక అధికారులు సైతం పట్టించుకోకపోవడం, స్థానికంగా కోల్డ్ స్టోరేజ్ లేకపోవడం, రాబడిలో రికార్డులు సృష్టిస్తున్న ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ కూరగాయలు నిల్వ చేసేందుకు కూల్‌చాంబర్ల నిర్మాణ అవసరాలను ప్రతిపాదనలకే పరిమితం చేయడం, రైతులు స్వయంగా విక్రయించేలా రైతు బజార్‌ల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడం వంటి కారణాలే ప్రస్తుతం అత్యధిక విస్తీర్ణంలో కూరగాయలు సాగవుతున్న ఇల్లెందు ప్రాంతంలో ధరలు ఆకాశన్నంటడానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా అటు రైతులు, ఇటు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.


ధరలు బాగా పెరిగాయి..



రూ.100తో కూరగాయల మార్కెట్‌కు వెళితే సంచి అడుగు భాగం కూడా దాటడం లేదు. ధరలు అంతగా మండిపోతున్నాయి. ఇలాగైతే ఏం కొంటాం.. ఏం తింటాం.. ధరల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యాటకూరి లీలావతి, సుభాష్‌నగర్

ఆరోగ్య సమస్యలు..



కూరగాయల ధరల పెరగటంతో వినియోగం తగ్గుతోంది. దీంతో శరీరానికి అవసరమైన విటమిన్లు, ఇతర పోషకాలు అందవు. ఫలితంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పోషకాలు అందేలా కూరగాయలను ఆహారంలో తీసుకోవాలి.

– డాక్టర్ కవిత, వైద్యాధికారి, రొంపేడు పీహెచ్‌సీ